## సభాపర్వ కథాంశాలు

ఇందులో 10(పది) ఉపపర్వాలు ఉన్నాయి. 4087 శ్లోకాలు వున్నాయి. వాటి వివరాలు ఇవి-

1) సభాక్రియాపర్వ (4-141)
2) లోకపాల సభాఖ్యానపర్వ (8-373)
3) రాజసూయపర్వ (7-265)
4) జరాసంధవధపర్వ (5-280)
5) దిగ్విజయపర్వ (8-389)
6) రాజసూయపర్వ (3-104)
7) అర్ఘాభిహరణపర్వ (4-843)
8) శిశుపాలవధపర్వ (6-252)
9) ద్యూతపర్వ (28-889)
10) అనుద్యూతపర్వ (8-360)

స్థూలంగా సభాపర్వకథ ఇది. ఖాండవదహనంలో రక్షింపబడిన మయుడు ధర్మరాజుకు ఒక సభ నిర్మించి తెచ్చియిచ్చాడు. ఆ సందర్భంగా దిక్పాలుర సభలన్నీ వర్ణింపబడ్డాయి. తరువాత ధర్మరాజు రాజసూయయాగం చేయాలని భావించాడు. దానికి ముందు జరాసంధుని వధించాలని కృష్ణుడు సూచించాడు. అపుడు కృష్ణుని, భీమార్జునులను పంపి ధర్మరాజు భీమునిచే జరాసంధుని చంపించాడు. అనంతరం తమ్ములను నాలుగు దిక్కులకు పంపి ధర్మరాజు దిగ్విజయం చేశాడు. అపుడు ధర్మరాజు రాజసూయం ప్రారంభించాడు. అందులో అర్ఘ్యమివ్వడంలో తలయెత్తిన వివాదంలో కృష్ణుడు శిశుపాలుని సంహరించాడు. మయసభలో దుర్యోధనుడు భంగపడ్డాడు. పాండవుల సంపదను చూసి ఓర్వలేకపోయాడు. తండ్రితోచెప్పి పాండవులను పిలిపించి ద్యూతమాడించాడు. శకుని ఆ జూదంలో ధర్మరాజును మోసంతో ఓడించాడు. కౌరవులు ద్రౌపదిని సభలో పరాభవించారు. శ్రీకృష్ణుడు రక్షించాడు. ద్రౌపది వాక్చాతుర్యంతో పాండవులకు మళ్లీ రాజ్యం వచ్చింది. పాండవులు ఇంకా పూర్తిగా ఇంద్రప్రస్థం చేరకుండానే అనుద్యూతానికి పిలిచారు. అనుద్యూతంలో అరణ్యవాసం, అజ్ఞాతవాసం పణంగా పెట్టారు. అందులోనూ పాండవులు ఓడిపోయారు. అడవుల

పాలయ్యారు. ఇది స్థూలంగా సభాపర్వ కథ. ఇక వివరాల్లోకి వెళ్లితే------

**1) సభాక్రియా పర్వ - (4)141**

ఖాండవవనదహనంలో చనిపోకుండా రక్షించినందుకు కృతజ్ఞతగా ఏదయినా ప్రత్యుపకారం స్వీకరించుమని మయాసురుడు కృష్ణార్జునులను కోరాడు. అపుడు కృష్ణుడు "నీ నైపుణ్యమంతా ప్రదర్శిస్తూ ధర్మరాజుకు ఒక సభ నిర్మించు" అని ఆదేశించాడు. మయుడు సంతోషంతో "సరే" అని వెంటనే సభారచనకు ఉపక్రమించాడు. కృష్ణుడు పాండవులను వీడ్కొని ద్వారకకు బయలుదేరాడు.

సభానిర్మాణం చేయడానికి తగిన సామగ్రి తెచ్చుకొనటానికి మయుడు ఈశాన్యములో ఉన్న బిందుసరోవరానికి వెళ్లాడు. కావలసిన సామగ్రి అంతా తెచ్చుకొని మయుడు సభానిర్మాణం చేశాడు. భీమునికి ఒక గదను, అర్జునునికి ఒక శంఖాన్ని ఇచ్చాడు. ఆ సభానిర్మాణానికి మయునికి పూర్తిగా 14 పదునాలుగు నెలలు పట్టింది.

ఒక సుముహూర్తంలో ధర్మరాజు మయసభాప్రవేశం చేశాడు. ఆ మహోత్సవానికి ఎంతోమంది రాజులు వచ్చారు. శిష్యసమేతంగా వ్యాసమహర్షివచ్చి ధర్మరాజును ఆశీర్వదించాడు. ఆ సభాగృహంలోనే ప్రద్యుమ్నుడు, సాంబుడు, సాత్యకి మొదలయిన వారికి అర్జునుడు ధనుర్విద్యనేర్పాడు.

**2) లోకపాలసభాఖ్యానపర్వ - (8) 373**

ఒకనాడు సభలో ఉన్న ధర్మరాజును నారదుడు దర్శించాడు. ధర్మరాజు దేవర్షికి యథావిధిగా స్వాగతం చెప్పి అర్చించాడు. నారదుడు ధర్మరాజుతో ధర్మకామార్థసంయుక్తంగా రాజ్యనిర్వహణకు సంబంధించి ఎన్నో కుశలప్రశ్నలు వేశాడు. అవి అన్నీ పరోక్షంగా రాజధర్మోపదేశంగా భాసిస్తాయి. ఆ ప్రశ్నలన్నిటికీ సముచిత వినయంగా సమాధానం చెప్పి నారదుని ధర్మరాజు ఇలా అడిగాడు. "మహాత్మా! మీరు అన్నిలోకాలూ సంచరిస్తారు కదా! ఇటువంటి సభకాని, ఇంతకంటె బాగున్న సభలుకాని

ఏమయినా ఉన్నాయా" అని అడిగాడు. నారదుడు "భూలోకంలో దీనితో సరితూగే సభ ఎక్కడా లేదు. ఇలాగే ఉన్న ఇంద్ర వరుణాది లోకపాలుర సభలు, శంకర, బ్రహ్మలసభలు గురించి చెపుతాను" అన్నాడు. అలాగే అందరి సభలను గురించి చెప్పాడు. అపుడు ధర్మరాజు "ఇంద్రసభలో ఒకే ఒక రాజర్షి హరిశ్చంద్రుని  చెప్పావు ఎందుచేత అంత

గొప్పగా చెప్పావు? అని అడిగాడు. అతడు రాజసూయయాగం చాలా వైభవోపేతంగా చేశాడనీ, అందుచేత అతనికి విశిష్టస్థానం లభించిందనీ చెప్పాడు. అంతేగాకుండా యమసభలో ఉన్న నీ తండ్రి పాండురాజు మానవలోకంలోకి వస్తున్న నన్నుపిలిచి" నీవు మా ధర్మరాజుతో ఇలా చెప్పు.  "రాజసూయయాగం చేయుమని నా మాటగా చెప్పు. అపుడు నేను హరిశ్చంద్రుని వలె ఉత్తమస్థితి పొందుతానని చెప్పు" అన్నాడనీ చెప్పాడు. ఈ మాట చెప్పి నారదుడు వెళ్లాక ధర్మరాజు ఆలోచనలో పడ్డాడు.

### 3) రాజసూయారంభపర్వ - (7) 265

రాజసూయాన్ని గురించి మంత్రులతో, తమ్ములతో, పురోహితులతో, ఆలోచించి, ధౌమ్యునితో, వ్యాసునితోకూడ చర్చించాడు. వారంతా ధర్మరాజు రాజసూయం చేయాలని ప్రతిపాదించారు. అపుడు ధర్మరాజు కృష్ణునికోసం ద్వారకకు మనిషిని పంపి కృష్ణుని రప్పించాడు. ధర్మరాజు రాజసూయం చేయాలంటే ముందు జరాసంధుని సంహరించాలని చెప్పాడు. దాని మీద చాలా `తర్జన భర్జనలు' జరిగాయి. మళ్లీ ఒకసారి ధర్మరాజు భీమార్జునులతో చర్చించి జరాసంధుని సంహరించటానికే నిశ్చయించాడు. కృష్ణుడు అపుడు ధర్మరాజుకు జరాసంధుని వృత్తాంతం ఇలా చెప్పాడు.

బృహద్రథుడు మగధదేశపురాజు. అతడు కాశిరాజు పుత్రికలిద్దరిని(కవలలు) వివాహం చేసుకున్నాడు. అతనికి మూడు అక్షౌహిణుల సైన్యం ఉంది. కాని సంతానం లేదు. అతడు ఒకనాడు గౌతమవంశస్థుడైన కాక్షీవంతుని పుత్రుడైన చండకౌశికుని దర్శించాడు. ఇరువురి భార్యలతో సహా అతనిని సేవించాడు. తనకు సంతానము లేదని

ఆయనకు నివేదించుకున్నాడు. అదే సమయంలో చండకౌశికుడు కూర్చున్న మామిడిచెట్టు నుండి ఒకపండు రాలినది. దానిని ఆ మునిశ్రేష్ఠుడు అభిమంత్రించి బృహద్రథునకిచ్చి నీకు పుత్రసంతానము కలుగునని ఆశీర్వదించాడు. బృహద్రథుడు ఆ పండును భార్యలిద్దరికీ ఇచ్చాడు. వారు ఆ పండును చెరిసగము భక్షించారు. వారిద్దరూ గర్భవతులైనారు. కొంతకాలానికి వారికి రెండు అర్ధశరీరపు ముక్కలు పుట్టినవి. వారికి ఒక్కొక్క చెయ్యి, ఒక కన్ను, ఒక్కొక్కకాలు ఉన్నాయి. రెండు ముక్కలు ప్రాణములతోనే ఉన్నాయి. వానిని రాణులు అంతఃపురద్వారము వెలుపల పడవేయించారు. ఆ మగధరాజ్యాన్ని జరా అనే రాక్షసి రక్షిస్తుంటుంది. ఆ రాక్షసి ఈ ముక్కలు రెండింటినీ చూసింది. ఆ రెండింటినీ దగ్గరకు చేర్చి చూసింది. వెంటనే రెండూ కలిసిపోయాయి. తేజస్వి అయిన కుమారునిగా రూపొందాయి. వెంటనే ఆమె ఆ కుమారుని తీసుకొనివచ్చి రాజుకు ఇచ్చింది. జరా అనే రాక్షసిచేత సంధింపబడినాడు గనుక జరాసంధుడని పేరు వచ్చింది. ఆ తరువాత కొంతకాలానికి బృహద్రథుడు చండకౌశికుని సలహా ప్రకారం (వానప్రస్థాన్ని స్వీకరించి) జరాసంధునికి పట్టాభిషేకంచేసి తాను వానప్రస్థాన్ని స్వీకరించాడు.

**4) జరాసంధవధపర్వ - (5) 280**

అతనికి హంసుడు, డిభకుడు అనే ఇద్దరు అనుచరులు ఉండేవారు. వారు ఆ మధ్యనే చనిపోయారు. అయినా ఆ జరాసంధుని సురాసురులు కూడా జయించలేరు. ధర్మజా! నీవు అనుమతినిస్తే మేము ముగ్గురము వెళ్ళి జరాసంధుని జయిస్తాము. నాకు నీతికౌశలము ఉంది. భీమునికి బలము ఉంది. అర్జునికి సామర్థ్యము ఉన్నది.

**మయి నీతిర్బలం భీమే రక్షితా చావయోర్జయః**
**మాగధం సాధయిష్యామ ఇష్టిం త్రయ ఇవాగ్నయః (20-3)**

అయినా భీముడుంటేచాలు జరాసంధుని సంహరిచటానికి అతడు బాహుయుద్ధంలోనే చనిపోతాడని నా అభిప్రాయము. దానికి భీముడే తగినవాడు. అందుచేత మేము ముగ్గురుము వెళ్ళి జరాసంధుని సంహరిస్తాము అన్నాడు కృష్ణుడు. అపుడు ధర్మరాజు కృష్ణా! నీవు అన్నంత పని చేయగలిగిన నిపుణుడవు. నీముందు నిలబడిన వాని దగ్గరనుండి రాజ్యలక్ష్మి విముఖురాలై నీకు సమ్ముఖురాలవుతుంది.

ఇలా అనుమతించి ధర్మరాజు ముగ్గురినీ జరాసంధుని మీదికి

పంపించాడు. జరాసంధుని పట్టణం పేరు గిరివ్రజము. ఆ పట్టణం చుట్టూ అయిదు పర్వతాలున్నాయి. కనుక దానికి గిరిదుర్గమను పేరుకూడా కలిగింది. అందులో చైత్యక గిరిశృంగము మీద మూడుభేరులున్నాయి. కొత్తవారు ఎవరైనా ఆ పట్టణంలోకి ప్రవేశిస్తూ ఉంటే అవి వాటంతట అవే మ్రోగుతుంటాయి. కృష్ణభీమార్జునులు ముప్పురు ఆ మూడు భేరులను బద్దలుగొట్టి ఆ పురప్రవేశం చేశారు. మాలాకార గృహాలకు వెళ్ళి పుష్పాలు, సుగంధాలు గ్రహించి ధరించారు. ముప్పురూ జరాసంధుని మందిరం ప్రవేశించారు. వీరిరాకను తెలుసుకున్న జరాసంధుడు ముప్పురికీ మధుపర్కమిచ్చాడు. కానీ, దానిని కృష్ణాదులు స్వీకరించలేదు. దానికి కారణమడిగాడు జరాసంధుడు. తాము స్నాతకులమనియూ, శత్రునివాసానికి అద్వారము (ద్వారం ద్వారా రాకుండుట) ద్వారా వచ్చుట క్షత్రియధర్మమని కృష్ణుడు చెప్పాడు. నీతో మాకు వేరే పని ఉండుటచే, నీవిచ్చే అర్ఘ్యమును, మధుపర్కమును మేము గ్రహించమని కృష్ణుడు సమాధానమిచ్చాడు.

నేను మీకు శత్రువును ఎలా అయ్యానని జరాసంధుడు ప్రశ్నించాడు. రాజవంశమున పుట్టిన మేము మా కులోద్వహుని ఆజ్ఞతో దుష్టశిక్షణకై వచ్చాము. నీవు రాజులను పశువులవలె బంధించుతున్నావు. సాధువులను హింసించే నిన్ను శిక్షించడానికి వచ్చాము. మా ముగ్గురిలో ఎవరినైనా సరే జయించుమని కృష్ణుడనగానే జరాసంధుడు మల్లయుద్ధానికి భీమసేనుని కోరుకున్నాడు. ఇద్దరూ మల్లయుద్ధానికి సిద్ధమయిరి. 13రోజులు యుద్ధం చేశారు. 14వ రోజురాత్రి జరాసంధుడు అలసిపోయినట్లు కనిపించాడు. అపుడు కృష్ణుడు భీమునితో ఇదే సమయమున నీవతనిని సంహరింపుము. మహాబలుడైన నీ తండ్రిబలము, నీ బలము ప్రకటింపుమని భీముని ప్రబోధించాడు. వెంటనే భీముడు జరాసంధుని సంధి సంధులను, ఎముకలను విరిచి సంహరించాడు. జరాసంధుని నోటినుండి, ముక్కునుండి, చెవులనుండి రక్తధారలు ఒలికేటట్లు జరాసంధునెత్తి గిరగిరాత్రిప్పి పడవేశాడు. భీముడు ఆ జరాసంధుని కళేబరమును రాజద్వారతోరణ సమీపమున పడవేశాడు. అది అందరికీ భయంకరంగా కనిపించింది తెల్లవారేసరికి. కృష్ణుడు జరాసంధుని కొడుకైన సహదేవుని ఓదార్చి చెరలోనున్న రాజులనందరినీ విడిపించాడు. సహదేవుని మగధరాజ్యానికి పట్టాభిషిక్తుని చేశాడు. రత్నరాసులతో నిండిన మగధేశుని

రథం తెప్పించి, కృష్ణుడు గరుత్మంతుని రప్పించి సారథిచేసికొని భీమార్జునులతో కారాగారముక్తులయిన రాజులతో ఇంద్రప్రస్థం వచ్చాడు. ధర్మరాజుకు విషయంచెప్పి, బంధముక్తులయిన రాజులను చూపి కృష్ణుడు ఆ రథంమీదనే ద్వారకకు వెళ్లాడు.

**5) దిగ్విజయపర్వ - (8) 389**

ధర్మరాజు దిగ్విజయంకోసం భీమార్జునులను పూర్వోత్తర దిక్కులకు, నకుల సహదేవులను పశ్చిమ దక్షిణ దిక్కులకు పంపాడు. ఉత్తరదిక్కుకు వెళ్లిన అర్జునుడు అచ్చటి రాజులను జయించి వారి నుండి ధర్మజునకు కప్పములు, కానుకలు తీసికొనివచ్చాడు. మానస సరోవరం చూసి, గంధమాదనపర్వతందాటి, హరివాసం దర్శించి ఉత్తర కురుభూముల రాజులనుండి కూడ కానుకలు కొనివచ్చాడు.

భీముడు తూర్పుదిక్కుకు పయనమై పాంచాలపతి మున్నగువారినుండి, కోసల, చేది, అయోధ్యదేశాధీశులనుండి కప్పములు కానుకలు కొనివచ్చాడు. మగధరాజు సహదేవునాశ్వాసించి పౌండ్రకవాసుదేవుని నుండి కప్పములు కొనివచ్చాడు.

దక్షిణమునకేగిన సహదేవుడు కుంతిభోజుని సత్కారంపొంది, అవంతి దేశాధీశులయిన విందానువిందులను వశపరచుకొని అగ్నిదేవుని మెప్పించి మాహిష్మతీ పురాధిపతినీలుని నుండి కూడ కప్పములు కొనివచ్చాడు. పాండ్య, కేరళ, ద్రవిడ కరహాలుకాది రాజులనుండి లంకాధిపతి నుండి కానుకలు గ్రహించి వచ్చాడు.

పశ్చిమమునకేగిన నకులుడు మరు, మాళవ, బర్బర కర్పర శైరీషక దాశార్ణరాజుల జయించాడు. పుష్కరారణ్య వాసులయిన ఆభీరులను, సరస్వతీనదీతీరమందలి గ్రామణీయులను, పంచనదామర పర్వత నివాసులను వశపరచుకొని కృష్ణునకు తనరాక తెలిపాడు. తనమేనమామను శల్యుని చూశాడు శాకల్యపురంలో. బర్బరకిరాతులను జయించి ఎన్నో కాలుకలు తెచ్చాడు.

**6) రాజసూయపర్వ - (3)104**

దిగ్విజయంతో ప్రసిద్ధుడైన ధర్మరాజును ఆప్తులందరూ త్వరగా రాజసూయము చేయమని ప్రేరేపించారు. కృష్ణుడు కూడా త్వరపెట్టాడు. ధర్మరాజు ధౌమ్యుని యొక్క, వ్యాసునియొక్క అనుమతితో రాజసూయానికి ఉపక్రమించాడు. రాజులందరినీ ఆహ్వానించేందుకు సహదేవుని ఆజ్ఞాపించాడు. నకులుడు వెళ్ళి కౌరవవంశస్థులైన భీష్మాదులను ఆహ్వానించి తీసుకొనివచ్చాడు. ధర్మరాజు వారి వారికి తగిన వేరువేరుపనులతో సముచితంగా నియమించాడు. దక్షిణలిచ్చేటపుడు సలహాదారునిగా కృపాచార్యులను నియమించాడు. కృతాకృత పరిజ్ఞానంలో భీష్మ, ద్రోణులను సవినయంగా నియమించాడు. సకలవస్తు సముదాయం యొక్క వ్యయంతో విదురుని అభ్యర్థించి నిర్దేశించాడు. నానాదేశాలనుండి వచ్చిన రాజులిచ్చిన కానుకలు తీసుకునేందుకు దుర్యోధనుని నియమించాడు. భక్ష్య, భోజ్యాది సమగ్రమైన అన్నపానములనివ్వటానికి దుశ్శాసనుని నియమించాడు. యజ్ఞదీక్షితుడైన ధర్మరాజును చూసి బ్రహ్మతేజస్సు, రాజతేజస్సు, రత్నతేజస్సు రూపుదాల్చినట్లుగా ప్రజలంతా ఎంతో సంతోషించారు.

### 7) అర్ఘాభిహరణపర్వ - (4) 843

ఈ యాగంలో ఒక వ్యక్తికి అగ్రపూజచేయాలని దానికి 1. ఆచార్యుడు, 2.
ఋత్విజుడు, 3. సంయుజుడు, 4. స్నాతకుడు, 5. స్నేహితుడు, 6. రాజు అనే ఆర్గురు తగిన వారని భీష్ముడు చెప్పాడు. ధర్మరాజు వెంటనే అటువంటి వ్యక్తిని మీరే నిర్ణయించండి అని భీష్ముని ప్రార్థించాడు. వెంటనే భీష్ముడు కృష్ణుని సూచించాడు. దానికి అందరూ సంతోషించారు కాని శిశుపాలునికి రుచించలేదు. కృష్ణునికి ఏ ఒక్క లక్షణమూ లేదని కించపరుస్తూ మాట్లాడి ధర్మరాజును శ్రీకృష్ణునీ ఉపాలంభించాడు. సభాభవనం నుండి వెళ్ళిపోయేందుకు సిద్ధపడిన శిశుపాలుని ధర్మరాజు అనునయించాడు. వాక్పారుష్యం పనికిరాదని బ్రతిమాలాడు. అపుడు భీష్ముడు కూడా కృష్ణుని అర్హతను, విశిష్టతను గురించి విస్తరించి చెప్పాడు. (728 1/2 శ్లోకాల అధికపాఠంకూడా కృష్ణుని అవతారాదికములను, లీలలను వివరించి చెప్పింది) అపుడు సహదేవుడు "దీనికి వ్యతిరేకించేవారి

శిరస్సుమీద తన కాలుపెడతానన్నాడు. అపుడు సహదేవునిపై పూలవాన కురిసింది.

**(8) శిశుపాలవధపర్వ - (6) 252**

శిశుపాలుని పక్షంలోని రాజులంతా చేసే గొడవ విని భీష్ముడు "కృష్ణుడు అనే సింహం మేల్కొనే వరకూ ఈ కుక్కలు ఇలా మొరుగుతూనే ఉంటాయి" అన్నాడు. అపుడు శిశుపాలుడు భీష్ముని బాగా నిందించాడు. భీమునికి కోపం వచ్చింది. భీష్ముడు భీముని వారించి శిశుపాలుని జన్మవృత్తాంతం చెప్పి, దీనికి కృష్ణుడే తగినట్లు వ్యవహరిస్తాడన్నాడు. అపుడు కృష్ణుడు కల్పించుకొని శిశుపాలుని తప్పులు కొన్నిచెప్పి, తనమేనత్తకిచ్చిన మాటప్రకారం నూరుతప్పులు ఇప్పటికి పూర్తికావటంచేత వీనినిపుడే సంహరిస్తున్నానని చక్రంతో శిశుపాలుని తల తెగనరికాడు. శిశుపాలుని శరీరంలోంచి ఒక తేజస్సు వెలువడి కృష్ణునికి నమస్కరిస్తూ కృష్ణునిలో కలిసిపోయింది. మిగతాయాగమంతా చక్కగా ముగిసింది. యాగానికి వచ్చిన రాజులందరినీ యుధిష్ఠిరుడు చక్కగా సత్కరించి పంపాడు. కృష్ణుడు కూడ ద్వారకకు వెళ్లిపోయాడు.

**(9) ద్యూతపర్వ - (28) 889**

రాజసూయం సమాప్తమయింది. ఎన్నో ఉత్పాతాలు పొడసూపుతున్నాయి. అపుడు వాటిని గురించి ధర్మరాజు వ్యాసుని అడిగాడు. వ్యాసుడు ఈ ఉత్పాతాలఫలితం
13సంవత్సరాలు ఉంటుంది. అపుడు సర్వక్షత్రియవినాశం కలుగుతుంది. నీకారణంగా, దుర్యోధనుని అపరాధంవల్ల, భీమార్జునుల పరాక్రమంవల్ల ఇది జరుగుతుంది. ఈ తెల్లవారుజామున నీకు కలలో శివుడు కనిపిస్తాడు. దక్షిణదిక్కును చూస్తూ ఉంటాడు. సరే! "కాలో హి దురతిక్రమః" అని చెప్పి వెళ్లిపోయాడు వ్యాసుడు. ధర్మరాజు తమ్ముళ్లతో ఆలోచించి చివరకు ఇలా అన్నాడు. "ఈ పదుమూడేళ్లూ నేను ఎవరినీ వ్యతిరేకించను. పరుషంగా మాట్లాడను" అన్నాడు.

ఇలా ఉండగా రాజసూయం చూసి రాజులంతా వెళ్లిపోయారు. కాని మయసభను చూడటానికి దుర్యోధనుడు, శకుని ఇంద్రప్రస్థంలోనే ఉన్నారు.

శకునితో కలిసి దుర్యోధనుడు మయసభావిశేషాలు చూస్తున్నాడు. స్ఫటిక శిలాతలం అనుకొని దుర్యోధనుడు నీళ్లలో పడ్డాడు. ఆదృశ్యం చూసి భీముడు నవ్వాడు. అర్జునుడూ కవలలూ కూడా నవ్వారు. అది భరించలేకపోయాడు దుర్యోధనుడు. మూసిన స్ఫటికద్వారాన్ని చూసి తెరిచే ఉందనుకొని లోనికి వెళ్లాడు. తలకు దెబ్బతగిలింది. ఇలా అవమానాలతో హస్తినాపురం బయలుదేరాడు. మనసు మనసులో లేదు. శకునికి అంతా చెప్పుకొన్నాడు. నేను చచ్చిపోతాను ధృతరాష్ట్రునికి నీవే చెప్పుమన్నాడు శకునిని. శకుని సమయంచూసి దుర్యోధనునితో వెళ్లి విషయం చెప్పవలసినతీరులో ధృతరాష్ట్రునికి చెప్పాడు. దుర్యోధనుడు కూడ తన విషాదానికి కారణం పాండవసంపద అని మరోనాలుగు సమిధలు వేసి చెప్పాడు. శకుని తాను పాండవసంపదను జూదంతో అపహరిస్తానని చెప్పాడు. ఈ పనికి ఒప్పుకోకపోతే చచ్చిపోతానన్నాడు దుర్యోధనుడు.

వెంటనే విదురుని పిలిపించాడు ధృతరాష్ట్రుడు. విదురుడు వచ్చాడు. "సుహృద్ద్యూతం జరగాలి. పాండవులను పిల్చుకొని రా" అన్నాడు ధృతరాష్ట్రుడు. ఆ మాటవిని వెంటనే విదురుడు భీష్ముని చేరాడు. ఇక దుర్యోధనుడు ఉన్నవీ లేనివీ ఎన్నో నూరిపోశాడు ధృతరాష్ట్రుడికి. ధర్మరాజుకు వచ్చిన కానుకలను చూచి సహింపలేకపోతున్నానన్నాడు. అన్నీ విని ధృతరాష్ట్రుడు జూదం పనికిరాదని నచ్చచెప్పాలని చూశాడు. దుర్యోధనుడు అలా అయితే చచ్చిపోతానన్నాడు. విదురుడు వచ్చి జూదంలోని దోషాలు అన్నీ ఏకరువుపెట్టాడు. అయినా సరే వెళ్లి ధర్మరాజును నా మాటగా తీసుకురా అన్నాడు ధృతరాష్ట్రుడు.

విదురుడు ధర్మరాజును చేరాడు. ధర్మరాజు జూదంలోని తప్పులు చెప్పాడు. అయినా తండ్రి ఆజ్ఞశిరసావహించితీరాలి అనుకొని తమ్ములతో ద్రౌపదితో హస్తినకు
బయలుదేరాడు. ఇష్టంలేకపోయినా భీష్మ, ద్రోణ, కృప, విదురులు ధృతరాష్ట్రుని అనుసరించారు. ద్యూతం ప్రారంభమయింది. శకుని మోసంతో పాచికలు వేస్తూ అన్ని పందెములూ గెలుస్తున్నాడు. ధర్మరాజు

ఓడిపోతున్నాడు. రాజ్యసంపదనంతా ఓడిపోయాడు. చూస్తూ ఊరుకోలేక విదురుడు ధృతరాష్ట్రునితో ఈ జూదాన్ని ఆపమన్నాడు. ధృతరాష్ట్రుడు వినిపించుకోలేదు. వంశనాశకుడయిన దుర్యోధనుని విడిచిపెట్టడం మంచిదని హితవు పలికాడు. శకునిని ఇక్కడనుండి పంపించివేయమన్నాడు. ధర్మరాజు తమ్ముళ్లను తననూ కూడా ఓడిపోయాడు. "ఇంకా ద్రౌపది మిగిలే ఉంది. పందెం ఒడ్డు" అని శకుని ప్రోత్సహించాడు. `సరే' అన్న వెంటనే శకుని "ఈ పందెం కూడా నేనే గెలిచా"నన్నాడు శకుని.

దుర్యోధనుడు వెంటనే విదురుని వెళ్లి ద్రౌపదిని ఇక్కడకు తీసుకురమ్మన్నాడు. అంతఃపురం శుభ్రం చేస్తుందని. విదురుడు "మూర్ఖా! జింక పులుల్ని రెచ్చగొడుతోంది." అని వ్యంగ్యంగా చెప్పాడు. నీ నెత్తిమీద విషసర్పాలు నాట్యమాడుతున్నాయి. అయినా ధర్మరాజుముందు తాను ఓడిపోయి తరువాత ద్రౌపదిని పణంగా పెట్టడం సమంజసంకాదు. ఈ దుర్యోధనుడికి పోగాలం దాపురించింది" అన్నాడు.

అపుడు దుర్యోధనుడు ప్రాతికామిని పిలిచి `ద్రౌపదినిక్కడికి తీసుకుని రా' అన్నాడు. వాడు వెళ్లి విషయం చెప్పాడు. ద్రౌపది "ముందు తాను ఓడిపోయాడా? నన్ను ఓడిపోయాడా? అని అడిగింది. ప్రాతికామి వచ్చి సభలో ధర్మరాజును అట్లాగే అడిగాడు. ధర్మరాజు సమాధానం చెప్పలేదు. వెంటనే దుర్యోధనుడు ద్రౌపదిని వచ్చి ఇక్కడే ఆ ప్రశ్న అడగమను" అన్నాడు. ప్రాతికామి వెళ్లి విషయం చెప్పాడు ద్రౌపదికి. ఆమె ప్రాతికామిని "సభలోని పెద్దలనడుగు వారేం చెపితే అది చేస్తాను" అంది. ప్రాతికామి మళ్లీ సభలోకి వచ్చి చెప్పాడు. సభలో ఎవరూ మాట్లాడలేదు. అపుడు దుర్యోధనుడు "ఆ ద్రౌపదిని ఇక్కడకే తీసుకురా" అన్నాడు. అయినా ప్రాతికామి ద్రౌపదికి భయపడి "ద్రౌపదికి ఏం చెప్పమంటారు?" అని మళ్లీ అడిగాడు. అపుడు దుర్యోధనుడు దుశ్శాసనుని పిలిచి "వీడు భీమునికి భయపడుతున్నాడు. నీవు వెళ్లి ఆమెను సభలోనికి స్వయంగా తీసుకొని రా" అన్నాడు. వాడు వెళ్లి ఆమెను లాక్కువచ్చాడు. రజస్వలనని, ఏకవస్త్రనని ఆమె ఆక్రోశిస్తున్నా వినిపించుకోకుండా నీవు

వివస్త్రవయినాసరే నిన్ను జూదంలో గెలుచుకున్నాం. నీవు దాసివి. దాసీల మధ్యనే నీవుండాలి అంటూ లాక్కువచ్చాడు. `దాసీ' అంటూ బిగ్గరగా అరిచాడు దుశ్శాసనుడు. కర్ణుడు దుశ్శాసనుని మాటను సమర్థించాడు. శకుని అభినందించాడు.

అపుడు భీష్ముడు "సాధ్వీ! నీ ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. జితోస్మి అని ధర్మరాజే అంగీకరించాడు. కాని యుధిష్ఠిరుడు ఎన్నడూ ధర్మం విడిచిపెట్టడు". అన్నాడు.

దీనంగా విలపిస్తున్న ద్రౌపదిని దుశ్శాసనుడు చాలా పరుషంగా ఎన్నో మాటలన్నాడు.

అపుడు వికర్ణుడు ఆమె అధర్మవిజిత ఎవరూ మాట్లాడరేం. ఇది సభయేనా? అని తీవ్రంగా మాట్లాడాడు. కర్ణుడు వెంటనే "పెద్దమాటలు మాట్లాడకు" అని వాని నోరు మూయించాడు. అంతటితో ఊరుకోక ఆమె వివస్త్ర అయినా సరే సభలోకి ఈడ్చుకొనిరావటం దోషంకాదు. శకుని ధర్మబద్ధంగానే గెలుచుకొన్నాడు. దుశ్శాసనా! వికర్ణుడికేమీ తెలియదు. "పాండవుల వస్త్రాలూ, ద్రౌపది వస్త్రాలూకూడా ఊడదీయి" అన్నాడు.

ఆమాటలు విని పాండవులు తమ ఉత్తరీయాలను తీసి కూర్చున్నారు. దుశ్శాసనుడు బలాత్కారంగా ద్రౌపదివస్త్రాలను ఊడదీయ మొదలుపెట్టాడు. అపుడు ద్రౌపది నిస్సహాయురాలై కృష్ణుని ధ్యానించింది. గోవింద ద్వారకావాసిన్ -------------మాముద్ధరస్వ అని వేడుకొంది. ధర్మస్వరూపుడయిన కృష్ణుడు అదృశ్యుడై ఆమెను సుందరవస్త్రాలతో ఆచ్ఛాదించాడు. రాజులంతా ద్రౌపదిని అభినందిస్తూ దుశ్శాసనుని నిందించారు. భీముడు భీషణ ప్రతిజ్ఞ చేశాడు. దుశ్శాసనుని రొమ్ముచీల్చి రక్తంత్రాగుతానని"- ప్రజలు ధృతరాష్ట్రుని కూడా నిందించారు.

అపుడు విదురుడు "ద్రౌపది ప్రశ్నకు సమాధానం చెప్పేబాధ్యత ఈ సభమీద ఉంది. వికర్ణుడు చెప్పినమాట నిజం" అన్నాడు. పాండవులనే సమాధానమివ్వమను అన్నాడు దుర్యోధనుడు. పాండవులు మాట్లాడలేదు. కర్ణుడు "జూదరికాని భర్తను ఎన్నుకో" అని పరిహసించాడు ద్రౌపదిని. ఆ సమయంలో దుర్యోధనుడు సైగలతో కర్ణునిరెచ్చగొడుతూ బట్టపైకెత్తి ద్రౌపదికి ఎడమ తొడను చూపిస్తాడు. వెంటనే భీముడు నీ తొడను

బ్రద్దలుచేస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

అపుడు ధృతరాష్ట్రుడు దుర్యోధనుని నిందించి ద్రౌపదితో "నీవు నా కోడళ్లలో అభ్యర్హితవు. ధర్మపరాయణవు నీకిష్టమయిన వరం కోరుకో" అన్నాడు. ద్రౌపది ధర్మరాజుయొక్క దాస్యమును పోగొట్టుమని కోరింది. ధృతరాష్ట్రుడు `అలాగే' అని మరోవరం కోరుకొమ్మన్నాడు. ద్రౌపది మిగిలిన పాండవులకు దాస్యవిముక్తి కోరింది. మూడవ వరం కోరుకొమ్మంటే `నేను అర్హురాలను కా'దని తిరస్కరించింది ద్రౌపది.

వెంటనే కర్ణుడు "మునిగిపోయే పాండవులను ద్రౌపది గట్టెక్కించింది". అని దెప్పిపొడిచాడు. భీమునికి ఆమాట చాలా బాధకలిగించింది. "పాండవులకు చివరకు స్త్రీగతి అయింది." అని వాపోయాడు. ధర్మరాజు వాని నోదార్చి ధృతరాష్ట్రాదుల దగ్గర వీడ్కోలు పొందాడు. పాండవులంతా ఇంద్రప్రస్థానికి బయలుదేరారు.

## 10) అనుద్యూతపర్వ - (8) 360

విషయం తెలిసి దుశ్శాసనుడు త్వరగా దుర్యోధనుని దగ్గరకు వెళ్లి "మనం ఎంతో కష్టపడి సంపాదిస్తే ఈ ముసలాడు మళ్లీ శత్రువులపాలు చేశాడు". అన్నాడు. అపుడు దుష్టచతుష్టయం ఆలోచించారు. వెంటనే ధృతరాష్ట్రునిచేరి దుర్యోధనుడు మళ్లీ జూదమాడటానికి ధృతరాష్ట్రుని అనుమతి తీసుకున్నాడు. ఇపుడు పందెం వనవాస, అజ్ఞాతవాసాలని ఒప్పించాడు. ఈ విషయాన్ని భీష్మద్రోణాదులంగీకరించలేదు. చివరకు గాంధారి కూడ ఒప్పుకోలేదు. పైగా "దుర్యోధనుని విడిచిపెడదాం అంది". కాని ధృతరాష్ట్రుడు నావంశం నాశనమయినా సరే వాడిని నివారించను" అన్నాడు పుత్రవ్యామోహంతో.

ప్రాతికామివెళ్లి ధర్మజాదులకు చెప్పాడు. తండ్రి ఆజ్ఞను వ్యతిరేకించలేని ధర్మజుడు అనుద్యూతానికి మళ్లీ హస్తినకు వచ్చాడు. పందెం గురించి వివరించాడు శకుని. ఒకే ఒక పందెంతో శకుని తాను గెల్చినట్లు ప్రకటించాడు.

పాండవులు నారబట్టలు దాల్చి వనవాసానికి వెడుతుంటే

దుశ్శాసనుడు అనరాని మాటలన్నాడు. పాండవులు ఇపుడు పొల్లువంటి వారనీ, నిర్వీర్యులయిన పుంసకులయ్యారని అన్నాడు. భీముని చూసి గౌః గౌః అని (ఎద్దు ఎద్దు) ఆక్షేపించాడు. పాండవులు ప్రతిజ్ఞలు చేస్తూ వివిధ రీతులతో వెళ్లిపోతున్నారు. వారు వెళ్లేటప్పుడు విదురుడు "కుంతీదేవి నాయింట్లో ఉంటుంది" అన్నాడు. కుంతీదేవి పాండవులను విడవలేకపోయింది. సహదేవుని యోగక్షేమములను ద్రౌపదికి అప్పజెప్పింది. ఈ విషయమంతా విదురుడు ధృతరాష్ట్రునికి వివరించాడు. ప్రజలంతా పాండవుల వనగమనాన్ని చూసి చాలా దుఃఖించారు.

**ఇది సభాపర్వ కథాంశము.**